సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



చీనీ టన్ను రూ.16 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.18
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.18, కనిష్టంగా రూ.9 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 1,800 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
34.3°/20.5°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

రెవెన్యూ సేవలు సత్వరం అందిస్తాం
- నూతన జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



ప్రశాంతి నిలయం : జిల్లా సమగ్రాభివృద్ధికి తన వంతు కృషి చేయడంతో పాటు రెవెన్యూ సేవలు పారదర్శకంగా, సత్వరం ప్రజలకు అందేలా చూస్తానని నూతన జాయింట్ కలెక్టర్ మంత్రి మౌర్య భరద్వాజ్ అన్నారు. సోమవారం ఉదయం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రాధాన్యం
ప్రశాంతి నిలయం: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న విభిన్న ప్రతిభావంతులకు రెండు ల్యాప్‌టాప్‌లు, 10 మంది బధిరులకు 10 టచ్‌ఫోన్లు, ఓ దివ్యాంగురాలికి వీల్ చైర్‌ను కలెక్టర్ అందజేశారు. ప్రభుత్వం అందించిన పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీఓ సువర్ణ, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ సహాయ సంచాలకులు జి.అర్చన తదితరులు పాల్గొన్నారు.

డీఐఓ సురేష్‌బాబు బాధ్యతల స్వీకరణ



పుట్టపర్తి అర్బన్: జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ)గా డాక్టర్ సురేష్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డీఐఓగా ఉన్న శ్రీనివాసరెడ్డి పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో విజయవాడ అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్‌లో పనిచేస్తున్న సురేష్ బాబును ఉన్నతాధికారులు నియమించారు. దీంతో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ బేగంను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ... వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది సహకారంతో సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తానన్నారు.

ఓలా ఈ -బైక్ కంపెనీకి 'ఫోరం' జరిమానా



అనంతపురం: ఓలా ఈ–బైక్ కంపెనీకి జిల్లా వినియోగదారుల కమిషనర్ జరిమానా విధించింది. వివరాలు.. కళ్యాణదుర్గం మండలం బత్తువానిపల్లి గ్రామానికి చెందిన పోలవరపు నాగరాజు 2024 ఏప్రిల్ 19న తన రూపే క్రెడిట్ కార్డు ద్వారా రూ.80,449 మొత్తాన్ని 'ఓలా ఈ–బైక్' కొనుగోలు నిమిత్తం చెల్లించాడు. కళ్యాణదుర్గం స్టేట్ బ్యాంకు జారీ చేసిన క్రెడిట్ కార్డు ద్వారా ఈ మొత్తాన్ని వారికి జమ చేశాడు. అయితే, ఓలా కంపెనీ వారు బైక్‌ను ఇవ్వకపోగా ఫోన్ కాల్స్, ఈ–మెయిల్స్‌కు కూడా స్పందించలేదు. ఈ నేపథ్యంలో 2024 అక్టోబర్ 18న ఓలా ఈ–బైక్ కంపెనీకి నాగరాజు లీగల్ నోటీసులు పంపాడు. వినియోగదారుల కమిషన్‌లో కేసు నమోదు చేశాడు. ఈ క్రమంలో ఓలా కంపెనీ ప్రతినిధులు కమిషన్ ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. తమకు ఎలాంటి మొత్తం చెల్లించలేదని, ఆన్‌లైన్ ద్వారా చెల్లింపు విషయంపై తమకు ఎలాంటి సమాచారం లేదని కంపెనీ తరఫున న్యాయవాదులు పేర్కొన్నారు. అయితే, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వారి వివరాల మేరకు ఓలా కంపెనీకి నాగరాజు నగదు చెల్లించినట్లు నిర్ధారణ కావడంతో వినియోగదారుల కమిషన్ ఫిర్యాదుదారు వాదనలతో ఏకీభవించింది. డబ్బు వెనక్కి చెల్లించకపోవడం, బైక్ ఇవ్వకపోవడాన్ని సేవాలోపంగా పరిగణించింది. ఫిర్యాదుదారు చెల్లించిన రూ. 80,449 మొత్తానికి 9 శాతం వార్షిక వడ్డీతో 2024 ఏప్రిల్ 19వ తేదీ నుంచి చెల్లించాలని తీర్పు వెలువరించింది. అలాగే, మానసిక వేదనకు పరిహారంగా రూ.20 వేలు, కోర్టు ఖర్చులు రూ.5 వేల చొప్పున మొత్తం సొమ్మును 45 రోజుల్లోపు చెల్లించాలని ఆదేశించింది. వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు ఎం.శ్రీలత, సభ్యులు గ్రేస్‌మేరీ, బి. గోపీనాథ్‌ల ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. బ్యాంకు సేవా లోపం లేదని నిర్ధారణ కావడంతో ఎస్‌బీఐపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.



పార్టీ శ్రేణులతో కలిసి పెనుకొండ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట బైఠాయించిన ఉషశ్రీచరణ్



ధర్మవరంలో ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నేతలు



దీపిక ఆధ్వర్యంలో హిందూపురంలో నకిలీ మద్యానికి వ్యతిరేకంగా నినదిస్తున్న దృశ్యం

నకిలీ మద్యంపై రణభేరి

పేదల ప్రాణాలు తీస్తున్న నారా వారి నకిలీ మద్యానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ రణభేరి మోగించింది. స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలతో పార్టీ శ్రేణులు, నాయకులు రణన్నినాదం చేశారు. కూటమి నేతల ధనదాహానికి ఇంకెన్ని కుటుంబాలు బలికావాలని ప్రశ్నించారు. నకిలీ మద్యాన్ని పూర్తిగా అరికట్టాలని డిమాండ్ చేశారు.

ఊరూవాడా కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు
- ర్యాలీలు..ఎక్సైజ్ స్టేషన్‌ల ఎదుట బైఠాయింపు
- నారా వారి నకిలీ లిక్కర్‌ను అరికట్టాలని డిమాండ్
- పేదల ప్రాణాలతో 'కూటమి' చెలగాటమాడుతోందని మండిపాటు
- మద్యం సీసాలు పగలగొట్టి నిరసన తెలిపిన వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, పుట్టపర్తి: నకిలీ మద్యానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు సోమవారం ప్రజలతో కలిసి పెనుకొండ, హిందూపురం, మడకశిర, ధర్మవరం, కదిరి, చెన్నేకొత్తపల్లి కేంద్రాల్లో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లను ముట్టడించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు. నకిలీ మద్యం మహమ్మారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

- పెనుకొండలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ కార్యకర్తలతో కలిసి ఎక్సైజ్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...నారా వారి నకిలీ లిక్కర్‌తో రాష్ట్రం నకిలీ మద్యాంధ్రప్రదేశ్‌గా మారిపోయిందన్నారు. కూటమి నేతలు మద్యం దుకాణాలు, బెల్టు షాపుల్లో నకిలీ మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నా.. అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తన స్వగ్రామం రాంపురంలోనే మద్యం దుకాణం వెలిసిందన్నారు. ఇక కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే చంద్రబాబు మద్యానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారారన్నారు. ఊరూరా బెల్ట్‌షాపులకు అనధికార అనుమతులిచ్చి ప్రజలతో తాగిస్తున్నారన్నారు. తాజాగా నకిలీ లిక్కర్ వ్యవహారంలో నంబర్‌వన్‌గా నిలిచారన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు నిరుపేదల ప్రాణాలు తీస్తున్న నకిలీ మద్యాన్ని పూర్తిగా అరికట్టాలని డిమాండ్ చేశారు. నకిలీ మద్యం దందాలోని ప్రతి ఒక్కరిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహిస్తే చంద్రబాబు దుష్ప్రచారం చేశారని, ఇప్పుడు తన అనుచరుల జేబులు నింపే క్రమంలో నకిలీ మద్యం తీసుకొచ్చి.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. అనంతరం పెనుకొండ ఎక్సైజ్ అధికారికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అన్నమయ్య జిల్లా మొలకలచెరువు ఘటన నేపథ్యంలో మద్యం దుకాణాలను తనిఖీ చేసి అనర్హులపై వేటు వేయాలని డిమాండ్ చేశారు.
- నకిలీ మద్యాన్ని అరికట్టాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కేతిరెడ్డి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వచ్చి ధర్మవరంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. నకిలీ మద్యం పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమే అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎక్సైజ్ అధికారికి వినతిపత్రం ఇచ్చారు.
- డబ్బుపై ఆశతో కల్తీ మద్యం విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం సరికాదని హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక మండిపడ్డారు. నకిలీ మద్యానికి వ్యతిరేకంగా సోమవారం ఆమె వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి హిందూపురంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ కాలనీలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ముట్టడించారు. కల్తీ మద్యం దందా వెనుక ఉన్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు.
- నకిలీ మద్యం వ్యవహారాన్ని నిరసిస్తూ మడకశిర పట్టణంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేశారు. అనంతరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. పేదల ప్రాణాలు తీస్తున్న నకిలీ మద్యాన్ని అరికట్టకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.
- నకిలీ మద్యం వ్యవహారంతో రాష్ట్రంలో అలజడి మొదలైందని వైఎస్సార్‌సీపీ నేత లింగాల లోకేశ్వరరెడ్డి అన్నారు. కదిరి సమన్వయకర్త బీఎస్ మక్బుల్ సూచన మేరకు సోమవారం ఆయన కార్యకర్తలతో కలిసి కదిరిలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. నకిలీ మద్యం దందా రాష్ట్రానికి మాయని మచ్చగా మిగిలిందన్నారు. నిరుపేదల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా...ఈ ప్రభుత్వానికి పట్టడం లేదని మండిపడ్డారు.
- మద్యం వ్యవహారంలో అవకతవకలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ రాప్తాడు నియోజకవర్గం చెన్నేకొత్తపల్లిలో వైఎస్సార్‌సీపీ నేతలు ర్యాలీ చేశారు. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రాప్తాడు మండలాల నుంచి తరలివచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు ఎక్సైజ్ సీఐ ఫరూక్ ఆజాంకు వినతిపత్రం అందజేశారు.



మడకశిర ఎక్సైజ్ కార్యాలయం ఎదుట పార్టీ నాయకులతో కలిసి బైఠాయించిన ఈరలక్కప్ప



కదిరి ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న పార్టీ నేతలు



చెన్నేకొత్తపల్లి ఎక్సైజ్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

సమస్యలు తీర్చండి సారూ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్

- 'పరిష్కార వేదిక'కు వెల్లువెత్తిన అర్జీలు
- నెలలుగా తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదని జనం ఆవేదన

ప్రశాంతి నిలయం: ''సారూ..నెలల తరబడి తిరుగుతున్నాం...అర్జీలు ఇస్తూనే ఉన్నాం..అయినా సమస్యలు తీరడం లేదు. ఇప్పటికైనా మా సమస్యలు తీర్చండి'' అంటూ జనం వాపోయారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు జిల్లా నలుమూలల నుంచి జనం తరలివచ్చారు. తమ సమస్యలపై అర్జీలిచ్చారు. ఈ సందర్భంలోనే పలువురు తమ సమస్యపై పదులసార్లు అర్జీలిచ్చినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. వివిధ సమస్యలపై మొత్తంగా 237 అర్జీలు అందగా.. కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ వాటిని స్వీకరించి పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీల పరిష్కారంలో పారదర్శకత పాటిస్తూ సత్వర న్యాయం జరిగేలా అధికారులు పని చేయాలని కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ ఆదేశించారు. కార్యక్రమం అనంతరం ఆయన వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఫిర్యాదులను పరిష్కరించే క్రమంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ చేపట్టాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. రీ ఓపెనింగ్, బియాండ్ ఎస్ఎల్ఏ లేకుండా అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం 'ఉత్తమ క్లాప్ మిత్ర'గా అవార్డు సీఎంతో ఈనెల 6న అవార్డు అందుకున్న కదిరి మండలం బురుగపల్లి గ్రామ పంచాయతీ 'క్లాప్ మిత్ర' సింగల దొడ్డెప్పను కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, డీపీఓ సమత, గ్రామ సర్పంచ్ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి పద్మశ్రీతో పాటు వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దారి మూసేశారు



గ్రామానికి దారి కల్పించాలని కలెక్టర్‌ను కోరిన రాశింపల్లి గ్రామస్తులు

పూర్వపు రాశింపల్లిలో మేము నివాసం ఉంటున్నాం. అయితే ,గ్రామంలోని కొందరు మేము గ్రామంలోకి రాకుండా, మా వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు వీలులేకుండా దారి మూసేశారు. వెంటనే వారిపై చర్యలు తీసుకుని మా పొలాలకు దారి చూపండి సార్. లేకపోతే మా జీవనాధారమైన వ్యవసాయం చేసుకోలేం.

– కలెక్టర్ ఎదుట వాపోయిన రాశింపల్లి గ్రామస్తులు



'ఉత్తమ క్లాప్ మిత్ర' సింగల దొడ్డెప్పను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా పట్టించుకోలేదు



ఏడాదిన్నర క్రితం గాలివానతో నా పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తులకు గురైంది. అప్పటి నుంచి పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా... వారి నుంచి ఎటువంటి స్పందనా లేదు. నేటికీ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయలేదు. సాగునీరు అందక పొలం బీడుగా మారింది. ఇప్పటికైనా స్పందించి నా పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బిగించేలా చూడండి.

– కలెక్టర్‌ను కోరిన నాగసముద్రం గేట్‌కు చెందిన నారాయణ స్వామి

పాఠశాల భవనం కబ్జా చేశారు



1958 సంవత్సరంలో మా గ్రామంలోని సర్వే నంబర్ 387లో ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి కొంత స్థలం కేటాయించి పాఠశాల నిర్మించారు. కాలక్రమంలో పాఠశాల వేరొక చోటుకు మార్చడంతో గతంలో కట్టిన పాఠశాల భవనాన్ని కూలదోసి స్థలాన్ని కొందరు కబ్జా చేశారు. ఈ స్థలాన్ని పరిరక్షించి గ్రామ అవసరాల కోసం ఉపయోగపడేలా చూడండి.

–కలెక్టర్‌కు విన్నవించిన పుట్టపర్తి మండలం వెంకటగారిపల్లికి చెందిన రాఘవేంద్ర

స్పందించండి.. కాపాడండి

- మన్నీలలో అరాచకాలపై పోలీసులకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



డీఎస్పీ మహబూబ్‌బాషాకు విన్నవిస్తున్న గ్రామస్తులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామంలో అరాచకాలు సృష్టిస్తున్న కుటుంబాలతో గ్రామస్తులకు ప్రమాదం పొంచి ఉందని పలువురు వాపోయారు. ఈ మేరకు సోమవారం అనంతపురంలో పోలీసు గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి విన్నవించారు. సుమారు వందమంది గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. బోయ బాలు, బోయ జయరాం, బోయ ఈశ్వర, బోయ శివ, బోయ బాలచంద్ర, ముష్టూరు బోయ అంజితో పాటు వారి బంధువులతో గ్రామంలో ఏ క్షణమైనా ఎలాంటి ప్రమాదమైనా జరగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ పొలిమేర దగ్గర ముష్టూరు గ్రామానికి చెందిన దివంగత బోయ కాటమయ్య 100 సంవత్సరాల క్రితం 5 ఎకరాల డీ పట్టా భూమి ఇతరులతో కొనుగోలు చేశాడన్నారు. ఆయన కుమారులు, మనవళ్లు ఇప్పుడు దౌర్జన్యంగా దాదాపు 30 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారన్నారు. ఎవరైనా నిలదీస్తే దాడులు చేస్తారన్నారు. తోటల్లో స్టార్టర్ పెట్టెలు, మోటార్లు, డ్రిప్పులు, స్ప్రింక్లర్లను ధ్వంసం చేస్తారన్నారు. వీరి దెబ్బకు భయపడి తోటల వద్ద మహిళలు ఒంటరిగా ఉండలేని పరిస్థితి ఉందన్నారు. ఇటుకలపల్లి, వజ్రకరూరు, బత్తలపల్లి, కూడేరు, ఉరవకొండ, అనంతపురం వన్‌టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లలో వీరిపై కేసులు నమోదయ్యాయన్నారు. ఇటీవల గ్రామంలో ఓ యువతికి పెళ్లి నిశ్చయమైతే పెళ్లి చేసుకునే యువకుడికి ఫోన్ చేసి ఆ అమ్మాయి పట్ల అసభ్యంగా చెప్పడంతో ఆ పెళ్లికాస్తా పెటాకులైందన్నారు. ఈ ఘటనపై గ్రామ ప్రజలందరూ ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే వారంతా ఇంటి మీదకు వచ్చి గొడవ చేయాలని చూశారన్నారు. గతంలో పోలీసులు కందుకూరు గ్రామంలో ఇలానే నిర్లక్ష్యం చేయడంతో ఒక హత్య జరిగిందని, మన్నీల గ్రామ విషయంలోనూ నిర్లక్ష్యం చేస్తే అంతే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వాపోయారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అన్నగిరి ఆదిశేషు, అల్లు షెక్షావలి నాయుడు, అల్లు రామాంజనేయులు, వర్ల ప్రసాద్, రామాంజనేయులు, అన్నగిరి శంకరయ్య, నాగమణి, లక్ష్మీదేవి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేంకటరమణుడికి సూర్యాభిషేకం

హిందూపురం: పట్టణంలోని పేట వేంకటరమణ స్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం అద్భుత దృశ్యం ఆవిష్కారమైంది. ఉదయం అభిషేకం అనంతరం వేంకటరమణ స్వామి మూలవిరాట్ పాదాలను సూర్యకిరణాలు తాకాయి. ఇలా దిగువ నుంచి మూలవిరాట్ పై వరకూ ప్రసరిస్తూ అభిషేకం చేస్తున్నట్లు కనిపించాయి. ఈ అపూర్వఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అనంతరం అర్చకులు మూలవిరాట్‌కు పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక అధికారి నరసింహమూర్తి, దేవస్థానం చైర్మన్ భగిరథ నవీన్ పాల్గొన్నారు.



పేట వెంకటరమణస్వామి మూలవిరాట్ పాదాలను తాకుతున్న సూర్యకిరణాలు

క్లుప్తంగా

సహకార బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్లపై చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

చిలమత్తూరు: మండలంలోని కోడూరు పీఏసీఎస్ పరిధిలో రైతులు చెల్లించిన రూ.20 లక్షల రుణం సొమ్ము స్వాహా చేసిన సీఈఓ నరేంద్ర కుమార్‌పై 'రైతులను ముంచిన సొసైటీ సీఈఓ' శీర్షికన ఈ నెల 11న 'సాక్షి'లో వెలువడిన కథనం విదితమే. దీనిపై స్పందించిన సహకార బ్యాంక్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం గోరంట్లలోని పీఏసీఎస్ బ్యాంక్ నోడల్ అధికారి మనోహర్ విచారణ చేపట్టారు. రైతుల నుంచి సేకరించిన రూ.20 లక్షల రుణం సొమ్ము వెంటనే బ్యాంక్‌కు చెల్లించాలని సీఈఓ నరేంద్రకుమార్‌ను ఆదేశించారు. కాగా, ఈ విషయంలో సదరు సీఈఓపై వేటు పడే అవకాశం కనిపిస్తోంది. అలాగే కొంత కాలంగా బ్యాంకులో జరుగుతున్న అక్రమాలపై తమకేమీ పట్టనట్లు వ్యవహరించిన ఇద్దరు అసిస్టెంట్ మేనేజర్లపై బదిలీ వేటు వేశారు.

మద్యం మత్తులో ప్రేమ జంట హల్‌చల్

కదిరి టౌన్: స్థాయి తాయి గ్రాండ్ హోటల్ సమీపంలో ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో ఓ ప్రేమ జంట మద్యం మత్తులో హల్‌చల్ చేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకోగా, వారిపై కూడా దురుసుగా ప్రవర్తించారు. వెంటనే సీఐ నారాయణరెడ్డి అక్కడకు చేరుకుని ఇద్దరినీ అదుపులోకి తీసుకొని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి, వైద్య పరీక్షలు నిర్వహించారు. అతిగా మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. విచారణలో వైఎస్సార్ కడప జిల్లా వేంపల్లి మండలం చక్రాయపేటకు చెందిన లోకేష్, అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటకు చెందిన షేక్‌భానుగా గుర్తించారు. కదిరిలోని ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో లోకేష్ పనిచేస్తున్నట్లుగా తెలిసింది. ఈ క్రమంలో ఆదివారం తన ప్రియురాలిని రప్పించుకుని ఇద్దరూ కలసి మద్యం సేవించిన అనంతరం లాడ్జిలో గది కోసం వెళ్లారు. వీరి వద్ద సరైన ఆధారాలు లేకపోవడంతో గది ఇచ్చేందుకు నిర్వాహకులు నిరాకరించారు. దీంతో లాడ్జి వద్ద గొడవకు తెరతీసినట్లు తెలిసింది.

ఐటీఐలో 5వ విడత అడ్మిషన్లు

హిందూపురం టౌన్: ప్రభుత్వ, ప్రైవేటు పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)ల్లో మిగులు సీట్ల భర్తీకి 5వ విడత అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ జిల్లా కన్వీనర్, హిందూపురం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ మురళీధర్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని అదే రోజు సాయంత్రం 4 గంటల్లోపు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలి. 17న కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు.

సైబర్ నేరగాళ్లు రోజుకో సరికొత్త విధానాలతో ప్రజలను మాయ చేస్తున్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన వారిని సైతం సులువుగా బురిడీ కొట్టిస్తున్నారు. ఇటీవల ఇంటి వద్ద నుంచే ఉద్యోగం చేయవచ్చునంటూ వల విసిరి రూ.లక్షలు దోచేశారు. నిరుద్యోగ యువతే లక్ష్యంగా పార్ట్‌టైమ్ జాబ్‌లంటూ మోసాలకు తెగబడ్డారు. సైబర్ నేరగాళ్ల బారిన పడిన బాధితులు లబోదిబోమంటూ మిన్నకుండిపోతున్నారు. ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో వారి ఆగడాలు ఎక్కువయ్యాయి.



ఆశపెట్టి.. మోసగించి!

పార్ట్‌టైం జాబ్ ఆఫర్‌తో సైబర్ వల
- ఇంటి వద్దే జాబ్ అంటూ ఉచ్చు
- రూ.వేల నుంచి రూ.లక్షల్లో దోపిడీ
- జిల్లాలో పెరుగుతున్న ఆన్‌లైన్ జాబ్ బాధితులు

ధర్మవరం అర్బన్: ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ జాబ్ అంటూ సైబర్ నేరగాళ్లు విసిరిన వలలో జిల్లా యువత చిక్కుకుని విలవిల్లాడుతోంది. ఆన్‌లైన్ జాబ్ సైట్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్, పత్రికల్లో నకిలీ ప్రకటనలు నమ్మి మోసపోతోంది. వీరిలో ఎక్కువ శాతం ఇంజనీరింగ్ పట్టభద్రులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఉద్యోగులు, నిరుద్యోగులే ఉన్నారు.

ఇంట్లో ఉన్నవారే లక్ష్యం

వర్క్ ఫ్రమ్ హోం పై మక్కువ పెంచుకున్న యువతను లక్ష్యంగా చేసుకుని జాబ్ స్కామర్లు చెలరేగిపోతున్నారు. తక్కువ సమయం, తక్కువ శ్రమతో నెలకు వేలాది రూపాయలు సంపాదించే జాబ్‌లు తమ వద్ద ఉన్నాయంటూ తరచూ ఆన్‌లైన్‌లో ప్రకటనలు గుప్పించి ఆకర్షిస్తున్నారు. ఈ ప్రకటనలు నమ్మి సంప్రదిస్తే ఫీజుల రూపంలో డబ్బు కట్టించుకుని ఆ తర్వాత బోర్డు తిరగేయడం షరా మామూలైంది.

తమనే నష్టపరిచారంటూ బ్లాక్ మెయిల్

జిల్లాలో రకరకాల డేటా ఎంట్రీ స్కామ్స్ వెలుగు చూస్తున్నాయి. ఎక్కువ స్కిల్స్ అవసరం లేదని, సింపుల్‌గా డేటా ఎంట్రీ చేస్తే చాలు డబ్బు సంపాదించవచ్చని నమ్మబలుకుతారు. ముందుగా ప్రాసెసింగ్ ఫీజు, ట్రైనింగ్ ఫీజు రూపంలో పేమెంట్ చేయించుకుంటారు. డేటా ఎంట్రీ అనంతరం అందులో తప్పులున్నాయని, దాని వల్ల తమ సంస్థ నష్టపోయిందని, పరిహారం చెల్లించకపోతే లీగల్ ప్రొసీడింగ్స్‌కు వెళతామని బెదిరింపులకు దిగుతూ పెద్ద మొత్తంలో నగదు లూటీ చేస్తున్నారు.

మచ్చుకు కొన్ని..

- నెలకు రూ.60 వరకు జీతం అందిపుచ్చుకుంటున్న ధర్మవరం నియోజకవర్గంలోని ఓ ప్రభుత్వ ఉద్యోగి... తీరిక వేళల్లో ఖాళీగా ఉండడం ఇష్టం లేక వర్క్ ఫ్రమ్ హోమ్ పేరిట ఆన్‌లైన్ టాస్క్‌లో పాల్గొన్నాడు. మొదట దాదాపు రూ.15వేల వరకు నగదు అతని ఖాతాకు బదిలీ అయింది. దీంతో పూర్తిగా నమ్మి అవతలి వ్యక్తుల డిమాండ్ మేరకు నగదు బదిలీ చేస్తూ రూ.2.75లక్షల వరకు పోగొట్టుకున్నాడు. ఆ తర్వాత తాను మోసపోతున్నట్లుగా నిర్ధారించుకుని మిన్నకుండిపోయాడు.
- ధర్మవరానికి చెందిన ఓ యువకుడు ఇంజినీరింగ్ పూర్తి చేసి ఆరునెలలుగా ఇంటి వద్దనే ఖాళీగా ఉన్నాడు. ఆన్‌లైన్‌లో జాబ్ కోసం వెతుకుతూ ఓ వెబ్‌సైట్‌లో లింక్‌ను ఓపెన్ చేశాడు. కొంత డబ్బు పెట్టుబడిగా పెడితే అంతకు రెట్టింపు వస్తుందని అవతలి వ్యక్తులు నమ్మబలకడంతో తొలుత రూ.5వేలు వారి ఖాతాకు పంపాడు. అనంతరం విడతల వారీగా రూ.1.35 లక్షల వరకు నగదు బదిలీ చేసినా తనకు రిటర్న్స్ లేకపోవడంతో అవతలి వ్యక్తులను నిలదీశాడు. వారి సమాధానంతో తృప్తి చెందక ఇకపై తాను డబ్బు వేయనని తేల్చి చెప్పడంతో వెంటనే వారి నంబర్లు, వాట్సాప్ గ్రూపు బ్లాక్ చేసేశారు.
- ధర్మవరంలో నివాసముంటున్న ఓ వివాహిత డిగ్రీ వరకు చదువుకుంది. ఇంట్లో ఖాళీగా ఉండలేక పార్ట్‌టైం జాబ్ కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేస్తుంటే రోజు రెండు గంటల పాటు పనిచేస్తే రూ.250 చొప్పున నెల రోజుల తర్వాత జీతం రూపంలో బ్యాంకు ఖాతాలోకి నగదు జమ అవుతుందనే ఓ సైట్ కనిపించడంతో సంప్రదించింది. అవతలి వ్యక్తుల మాటలు నమ్మి తొలుత రూ.5వేలు చెల్లించింది. ఆ తర్వాత రోజు రూ.250 నుంచి రూ.500ల వరకు సంపాదిస్తున్నట్లు వారం రోజుల పాటు ఆన్‌లైన్ వాలెట్‌లో కనిపిస్తూ వచ్చింది. వారు విధించిన గడువులోపు మ్యాటర్ టైప్ చేసి ఇవ్వకపోతే ఎదురు డబ్బు చెల్లించాలనే నిబంధన ఉండడంతో పలుమార్లు తన ఖాతా నుంచి దాదాపు రూ.55వేల వరకు ఆమె బదిలీ చేస్తూ వచ్చింది. అయితే రెండు నెలలు గడిచినా ఆమె బ్యాంక్ ఖాతాలోకి డబ్బు జమకాకపోవడంతో మోసపోయానని గ్రహించి వెంటనే భర్తకు వివరించింది.
- ధర్మవరంలోని యాదవవీధిలో నివాసముంటున్న బీటెక్ పూర్తి చేసిన యువకుడు పార్ట్‌టైం జాబ్ కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేశాడు. ఇంట్లో గంటసేపు కష్టపడి డబ్బులు సంపాదించుకోవచ్చని ఓ వెబ్‌సైట్‌లో సమాచారాన్ని నమ్మి తన సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు అప్‌లోడ్ చేశాడు. ముందుగా ప్రాసెసింగ్ ఫీజు, ట్రైనింగ్ ఫీజు పేరుతో అడ్వాన్స్‌గా రూ.15వేలు సైబర్ నేరగాళ్లు తమ ఖాతాలోకి జమ చేయించుకున్నారు. అనంతరం తాము ఇచ్చిన మ్యాటర్‌ను అలాగే టైప్ చేసి పంపాలని, గంటలోపు ఎన్ని పదాలు టైపు చేస్తే అంత డబ్బు బ్యాంక్ ఖాతాలోకి జమ అవుతుందని నమ్మబలికారు. దీంతో యువకుడు టైపు చేస్తుండగా, తప్పులు ఉన్నాయని, దీంతో కంపెనీ పరువు పోయిందని, పరిహారం రూ. 2 లక్షలు చెల్లించకపోతే కోర్టుకు లాగుతామని బెదిరించారు. పక్కనే ఉన్న తమ న్యాయవాదితో మాట్లాడమంటూ మరో వ్యక్తికి ఫోన్ ఇచ్చారు. విషయాన్ని వెంటనే సదరు యువకుడు పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో అప్రమత్తమైన సైబర్ నేరగాళ్లు వారి నంబర్‌ను బ్లాక్ చేశారు.

అప్రమత్తంగా ఉండాలి



ఆన్‌లైన్‌లో వచ్చే ఉద్యోగ ప్రకటనలు చూసి మోసపోవద్దు. యువత నైపుణ్యం పెంచుకోవడానికి కోచింగ్ సెంటర్లకు వెళ్లి కొత్త కోర్సులు అభ్యసించాలి. సాధారణంగా ప్రముఖ సంస్థలు ఎప్పుడూ రిజిస్ట్రేషన్ ఫీజు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఫీజు పేరిట నగదు వసూలు చేయవు. జాబ్ స్కామర్ల ప్రకటనల్లో, ఈ మెయిల్స్‌లో ఎక్కువగా గ్రామర్ తప్పులు ఉంటాయి. జాబ్ డిస్క్రిప్షన్ కూడా అస్పష్టంగా ఉంటుంది. క్విక్ మనీ, అన్‌లిమిటెడ్ ఎర్నింగ్స్, ఎలాంటి టెక్నికల్ స్కిల్స్ అవసరం లేదు అనే పదాలపై అప్రమత్తంగా ఉండాలి. మోసపోయామని గ్రహిస్తే సమీప పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ధైర్యంగా ఫిర్యాదు చేయాలి. – సీఐ రెడ్డెప్ప, టూ టౌన్ పోలీస్ స్టేషన్, ధర్మవరం

పరిష్కార వేదికకు 75 వినతులు

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 75 వినతులు అందాయి. ఎస్పీ సతీష్‌కుమార్ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు, ఎస్‌బీ సీఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

మీ బిడ్డలకు అన్యాయం జరిగితే ఇలానే చేస్తారా

మీ సొంత బిడ్డలకు అన్యాయం జరిగితే ఇలాగే వ్యవహరిస్తారా అంటూ సోమందేపల్లి పోలీసులను ఎస్పీ సతీష్‌కుమార్ నిలదీశారు. బాధితుల ఫిర్యాదు మేరకు వెంటనే కేసు నమోదు చేయాలని ఆదేశించారు. వివరాలు.. సోమందేపల్లికి చెందిన లక్ష్మికి ధర్మవరం మండలం కుణతూరుకు చెందిన నరేంద్ర రెడ్డితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. అనంతపురంలో కొద్ది రోజులు కాపురం ఉన్నారు. అనంతరం చోటు చేసుకున్న విభేదాల కారణంగా ఇద్దరూ ఎవరింటికి వారు వెళ్లిపోయారు. ఈ క్రమంలో కొన్నేళ్ల క్రితం నరేంద్రరెడ్డి తన మేనత్త కుమార్తెను పెళ్లి చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న లక్ష్మి తనకు న్యాయం చేయాలంటూ సోమందేపల్లి పీఎస్ ఎస్ఐ రమేష్‌కు ఫిర్యాదు చేసింది. అయితే అతనిపై కేసు నమోదు చేయడానికి సెక్షన్లు లేవంటూ పోలీసులు నిర్దయగా వెనక్కు పంపారు. దీంతో గత సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీని కలసి బాధితురాలు తన గోడు వెల్లబోసుకుంది. దీనిపై స్పందించిన ఎస్పీ వెంటనే బాధితురాలి సమస్యకు పరిష్కారం చూపాలని సోమందేపల్లి పీఎస్ సిబ్బందిని ఆదేశించారు. అయినా ఎలాంటి చర్యలు లేకపోవడంతో సోమవారం మరోసారి ఎస్పీని కలిసింది. దీనిపై ఎస్పీ స్పందించారు. సోమందేపల్లి పీఎస్‌కు ఫోన్ చేసి తీవ్ర స్థాయిలో మందలించారు. ఏ ఒక్క ఆడబిడ్డలకు అన్యాయం జరగకూడదని, వెంటనే కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీ చూపాలని ఆదేశించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి హత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో రెండు హత్యలు చోటు చేసుకున్నాయి. తల్లి పేరుపై ఉన్న ఇంటిని తన పేరుపై రాసివ్వలేదన్న అక్కసుతో కుమారుడు మద్యం మత్తులో చెలరేగిపోయాడు. కత్తితో దాడి చేసి హతమార్చాడు. ఈ ఘటన కదిరిలో చోటు చేసుకుంది. హిందూపురం మండలంలో కల్లు అంగడి వద్ద చోటు చేసుకున్న ఘర్షణలో కర్ణాటక ప్రాంతానికి చెందిన ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు.

- ఆస్తి రాసివ్వలేదని కదిరిలో కన్నతల్లినే కత్తితో పొడిచి హతమార్చిన తనయుడు
- కల్లు సేవించే సమయంలో చోటు చేసుకున్న ఘర్షణలో కర్ణాటక వాసి హతం

కదిరి టౌన్: స్థానిక మున్సిపల్ పరిధిలోని నిజాం వలీ కాలనీలో నివాసముంటున్న షేక్ ఖాసీంబీ (65) హత్యకు గురైంది. ఇంట్లో నిద్రిస్తున్న ఆమెను కుమారుడే కత్తితో దారుణంగా పొడిచి హతమార్చాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ఖాసీంబీ కుమారుడు బాబా ఫక్రుద్దీన్ అలియాస్ బాషా కొన్నేళ్ల క్రితమే ఇల్లు వదిలి శ్రీశైలం చేరుకుని అక్కడే పెళ్లి చేసుకుని స్థిరపడ్డాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. తనకు ఇద్దరు కుమార్తెలు కాగా, పెద్ద అమ్మాయికి పెళ్లి చేసిచ్చానని, రెండో కుమార్తె పెళ్లికి డబ్బు అవసరమైందని తల్లితో చెప్పుకున్నాడు. తల్లి పేరు మీద ఉన్న ఇంటిని తన పేరుపై రాసివ్వాలంటూ గొడవ పడుతూ వచ్చాడు. ఈ క్రమంలోనే సోమవారం ఇంట్లో గొడవ పడిన అనంతరం బయటకు వెళ్లి మద్యం సేవించి ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే నిద్రిస్తున్న తల్లిపై కత్తితో దాడి చేసి, హతమార్చాడు. చుట్టుపక్కల వారు గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.



హతురాలు ఖాసీంబీ

హిందూపురం: మండలంలోని సంతేబిదనూర్ సమీపంలో కర్ణాటక వాసి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్ణాటకలోని గౌరీబిదనూరు పట్టణానికి చెందిన పవన్ కుమార్ (26) రెండు రోజుల క్రితం హిందూపురం మండలం రాచేపల్లిలో బంధువుల ఇంట శుభ కార్యంలో పాల్గొనేందుకు వచ్చాడు. ఆదివారం రాత్రి తిరుగు ప్రయాణమై కల్లు సేవించేందుకు సంతేబిదనూర్ సమీపంలో చెరువు వద్ద ఉన్న కల్లు అంగడికి చేరుకున్నాడు. అక్కడ ఘర్షణ చోటు చేసుకోవడంతో దుండగులు హతమార్చి గుర్తు పట్టేందుకు వీలులేకుండా పెట్రోలు పోసి నిప్పంటించారు. సోమవారం ఉదయం అటుగా వెళ్లిన వారు మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో హిందూపురం రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గుత్తిలో పందుల దొంగల బీభత్సం

- రాళ్లు, మద్యం బాటిళ్లతో దాడి



గాయపడిన పందుల యజమాని నారాయణస్వామి

గుత్తి: స్థానిక తురకపల్లి రోడ్డులో పందుల దొంగలు బీభత్సం సృష్టించారు. ఆదివారం అర్ధరాత్రి, తిరిగి సోమవారం తెల్లవారుజాము నాలుగు గంటల సమయంలో పందుల పెంపకందారులపై రాళ్లు, మద్యం బాటిళ్లతో విరుచుకుపడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం అర్ధరాత్రి సమయంలో బొలెరో వాహనంలో వచ్చిన పది మంది దుండగులు పందులను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో అక్కడికి సమీపంలో ఉన్న చేపల వెంకటేష్ గమనించడంతో అతనిపై రాళ్లు, మద్యం బాటిళ్లతో విరుచుకుపడ్డారు. దాడిలో వెంకటేష్‌కు చెందిన రెండు ఐచర్ వాహనాలు దెబ్బతిన్నాయి. దూసుకొస్తున్న రాళ్లు, మద్యం బాటిళ్ల నుంచి తప్పించుకునే క్రమంలో ఐచర్ వాహనాల డ్రైవర్లు, చేపల సిబ్బంది అక్కడి పరుగు తీసి ఓ గదిలో దూరి షట్టర్ వేసుకున్నారు. విషయం తెలుసుకున్న పందుల పెంపకందారులు నారాయణస్వామి, వెంకటరాముడు, శీను, గంగన్న తదితరులు తురకపల్లి రోడ్డులోకి చేరుకోగా మరోసారి వారిపై కూడా రాళ్లు, బాటిళ్లతో దాడికి తెగబడ్డారు. నారాయణస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. అయితే పందుల పెంపకందారులు కూడా దీటుగా ఎదుర్కోవడంతో కొన్ని పందులను వదిలి బొలెరో వాహనంలో ఉడాయించారు. ఈ దృశ్యాలన్నీ అక్కడున్న సీసీ కెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమయ్యాయి. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థులకు సైన్స్ సెమినార్ పోటీలు

అనంతపురం సిటీ: జాతీయ సైన్స్ సెమినార్–2025ను పురస్కరించుకుని 'క్వాంటమ్ ఏజ్ బిగిన్స్ – పొటెన్షియల్, ఛాలెంజస్' అంశంపై జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో చదివే 8 ,9 10 విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సైన్స్ సెంటర్ జిల్లా అధికారి బాలమురళీకృష్ణ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 15న పాఠశాల స్థాయిలో పరీక్ష నిర్వహించి ప్రతిభ కనబరిచిన ఇద్దరికి 16న మండల స్థాయిలో పరీక్ష నిర్వహిస్తారు. మండల స్థాయిలో ఎంపికైన ఇద్దరి చొప్పున ఈ నెల 17న అనంతపురంలోని సైన్స్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు సైన్స్ సెమినార్ నిర్వహించనున్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఐదు చార్ట్స్, స్లైడ్స్ ఉపయోగిస్తూ గరిష్టంగా ఆరు నిమిషాల పాటు ప్రజంటేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. జిల్లా స్థాయి సెమినార్‌లో ప్రతిభ చాటిన ఇద్దరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు.

హంద్రీ-నీవా కాలువలో వ్యక్తి గల్లంతు



నాగభూషణం (ఫైల్)

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు వద్ద ఉన్న హంద్రీ-నీవా కాలువలో పడి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ మండలం కురుగుంటకు చెందని నాగభూషణం, ఓబులేసు సోమవారం బెళుగుప్ప మండలం జీడిపల్లిలో ఉన్న బంధువు కర్మకాండలకు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. హంద్రీ నీవా కాలువ వద్దకు చేరుకోగానే స్నానం చేసేందుకు సిద్ధమయ్యారు. ఓబులేసుకు ఈత రాకపోవడంతో మెట్ల వెంట దిగి కాళ్లు, చేతులు శుభ్రం చేసుకుని వచ్చాడు. అనంతరం నాగభూషణం కాలువలో దిగి ఈత కొడుతూ ప్రవాహ వేగానికి కొట్టుకు పోయాడు. ఆ సమయంలో ఓబులేసు కేకలు వేసి చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేసే లోపు నాగభూషణం (62)కనిపించకుండా పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

పూజారి ముసుగులో గంజాయి విక్రయం

ఇద్దరి అరెస్ట్.. 4 కిలోల గంజాయి స్వాధీనం



నిందితులను అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

గుంతకల్లు: ఆలయ పూజారి ముసుగులో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తితో పాటు మరొకరిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఎక్సైజ్ సీఐ శివసాగర్ వెల్లడించారు. సోమవారం గుంతకల్లులోని హనుమన్ సర్కిల్‌లో తనిఖీలు చేపట్టిన సమయంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో వెంటనే అడ్డుకుని పరిశీలించారు. వారి వద్ద 4 కిలోల ఎండు గంజాయి గుర్తించి అదుపులోకి తీసుకుని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో పలు ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. ఏలూరు జిల్లా వెంకటాపురంలోని ఎన్టీఆర్ కాలనీలో నివాసముంటున్న పూజారి సురేష్‌బాబు కుమారుడు తిరునగరి మోహన్‌సుందర్ జల్సాలకు అలవాటు పడి పలు దొంగతనం కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకుని గుత్తి మండలం అబ్బేదొడ్డి గ్రామ రామాలయంలో అర్చకుడిగా చేరాడు. ఈ క్రమంలో ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి అబ్బేదొడ్డికి చెందిన సాయిరామ్ అలియాస్ గంజాయి సాయి ద్వారా గుత్తి, గుంతకల్లు పట్టణాల్లో విక్రయించి సొమ్ము చేసుకోవడం మొదలు పెట్టాడు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న వెంకటలక్ష్మి

ధర్మవరం అర్బన్: స్థానిక గాంధీనగర్ రైల్వేగేటు వద్ద రైలు ఢీకొని ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని రాంనగర్‌లో నివాసముంటున్న వృద్ధురాలు వెంకటలక్ష్మికి కొంతకాలంగా మతిస్థిమితం సరిగాలేదు. సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె గాంధీనగర్ రైల్వేగేటు వద్ద పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొంది. ఘటనలో ఎగిరి పట్టాల పక్కన పడిన ఆమెను స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పింఛన్ ఇప్పిస్తానంటూ మోసం

రామగిరి: మండలంలోని పలు గ్రామాల్లో అర్హులైన వారికి పింఛన్ ఇప్పిస్తామంటూ ఓ అజ్ఞాత వ్యక్తి డబ్బు వసూలు చేసిన విషయం సోమవారం వెలుగు చూసింది. బాధితులు తెలిపిన మేరకు... తనను తాను శివగా పరిచయం చేసుకున్న ఓ వ్యక్తి కలెక్టరేట్ ఏఎస్‌ఓగా పనిచేస్తున్నట్లు నమ్మబలికాడు. మండలంలో పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు ఆరా తీసి వారికి 94406 90029 నంబర్‌తో ఫోన్ చేసి మాట్లాడాడు. పింఛన్ మంజూరయ్యేలా చేస్తానంటూ ఒక్కొక్కరితో రూ.5 వేలు నుంచి రూ.10 వేల వరకూ అక్రమంగా వసూలు చేసి, ఆ తర్వాత ఫోన్ ఎత్తకుండా ముఖం చాటేశాడు. మొత్తం రూ.30 వేలకు పైగా వసూలు చేసినట్లు సమాచారం. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు.

కదిరిలో కిడ్నాప్ కలకలం

కదిరి టౌన్: పట్టణంలో కిడ్నాప్ కలకలం రేపింది. సోమవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. అడపాలవీధికి చెందిన వెంకటరమణమ్మ, ఆదినారాయణ దంపతుల కుమారుడు బాకు ప్రవీణ్‌కుమార్‌కు ఐదేళ్ల క్రితం శ్రీకాళహస్తికి చెందిన మంజులతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మనస్పర్థల కారణంగా గత కొన్నేళ్లుగా ఇద్దరూ దూరంగా ఉంటున్నారు. మంజుల ప్రస్తుతం తిరుపతి జిల్లా తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. సోమవారం సాయంత్రం మంజుల తరఫు బంధువులు రెండు వాహనాల్లో కదిరికి వచ్చారు. ప్రవీణ్‌కుమార్, ఇంటి పనిమనిషి చైతన్య అనే మహిళపై దాడి చేసి కిడ్నాప్ చేశారు. అడ్డుకోబోయిన ప్రవీణ్‌కుమార్ తల్లిదండ్రులను చెప్పులతో కొట్టి వెళ్లిపోయారు. ఈ మేరకు వెంకటరమణమ్మ ఫిర్యాదు మేరకు కోడలు మంజుల, ఆమె అన్న కంపా రాజేష్, మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మవరం రూరల్: రావులచెరువు వద్ద ఉన్న గంగమ్మ గుడి సమీపంలో సోమవారం రాత్రి పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,900 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

చిన్నారిపై వీధి కుక్కల దాడి

గుంతకల్లు: స్థానిక బీఎస్ఎస్ కాలనీలోని మార్కేండేయ స్వామి ఆలయం వద్ద ఓ చిన్నారిపై వీధి కుక్కల మంద దాడి చేసింది. బీఎస్ఎస్ కాలనీకి చెందిన రామలక్ష్మి తన మూడేళ్ల వయసున్న కుమార్తె సుచిత్రను సోమవారం సాయంత్రం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వదిలేందుకు వెళుతుండగా ఒక్కసారిగా ఆరు కుక్కలు వీరిపై దాడి చేశాయి. సుచిత్రను రెండు కుక్కలు కరవడంతో నడుంపై రక్తగాయాలయ్యాయి. చిన్నారిని రామలక్ష్మి తన గుండెలకు హత్తుకున్నా కుక్కలు వీడలేదు. ఆ సమయంలో స్థానికులు వెంటనే అక్కడకు చేరుకుని కుక్కలను తరిమేశారు. సుచిత్రను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని నార్పల క్రాస్ వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. నార్పలకు చెందిన శివప్రసాద్ (35) వ్యక్తిగత పనిపై సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై అనంతపురానికి బయలుదేరాడు. బీకేఎస్ శివారున నార్పల క్రాస్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వెళుతున్న ఆటో బోల్తాపడింది. ఆ సమయంలో వెనుకనే ఉన్న శివప్రసాద్ వేగాన్ని నియంత్రించుకోలేక బోల్తాపడిన ఆటోను ఢీకొని కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వెంటనే 108 అంబులెన్స్‌లో అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్సకు స్పందించక మృతిచెందాడు. ఘటనపై బీకేఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ ఎక్కబోతూ...

పెద్దపప్పూరు: ట్రాక్టర్ ఎక్కబోతూ కాలు జారి కింద పడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... మండలంలోని నామనాంకపల్లికి చెందిన నారాయణమ్మ (70)కు ముగ్గురు సంతానం కాగా, చిన్న కుమారుడి వద్ద ఉంటూ వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తోంది. సోమవారం కూలి పని కోసం వెళ్లిన ఆమె సాయంత్రం వర్షం కురుస్తుండడంతో కూలీలందరితో కలసి ఇంటికి వెళ్లేందుకు ట్రాక్టర్ వద్దకు చేరుకుంది. ట్రాక్టర్ ఎక్కబోతుండగా కాలికి అయిన బురద కారణంగా జారి కిందపడింది. ఆ సమయంలో ఆయుపట్టుకు బలమైన దెబ్బ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

టిప్పర్ ఢీకొని...

తాడిపత్రి రూరల్: టిప్పర్ ఢీకొని ఓ ఆటో డ్రైవర్ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... యల్లనూరుకు చెందిన కుళ్లాయప్ప (38) ఉపాధి కోసం కుటుంబసభ్యులతో కలిసి తాడిపత్రికి వలస వచ్చి షేర్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఆటోలో వెళుతుండగా చుక్కలూరు క్రాస్ వద్దకు చేరుకోగానే వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ ఢీకొంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ టిప్పర్‌తో సహా ఉడాయించాడు. అదే సమయంలో మరో ఆటోలో వెళుతున్న సోదరి కృష్ణవేణి గుర్తించి వెంటనే కుళ్లాయప్పను తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ శివగంగాధరరెడ్డి తెలిపారు.